సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 2 । మార్చి । 2024

I



నాటి రామబాణం..నేటి రామతీర్థం
ఒంటిమిట్టలోని రామతీర్థం అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి.రూ. 35 లక్షలతో చేపట్టిన నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి. -IIలో



ఎన్నికల నిర్వహణకు సిద్ధం
అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్నీ సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ విజయరామ రాజు అన్నారు. నియోజకవర్గాల వారీగా ఎపిక్ కార్డులను రూపొందించామన్నారు. -IIలో

గరిష్టం/కనిష్టం
36.5/20.3

వాతావరణం
జిల్లాలో శుక్రవారం 20.3 – 36.5 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
– కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

ఠంచన్‌గా పింఛన్
కడప రూరల్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. తెల్లవారుజామునే వలంటీర్లు అవ్వాతాతల ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలుకరించారు. ఆరోగ్యం గురించి వాకబు చేసి కుశల ప్రశ్నలు వేశారు. అనంతరం పింఛన్ నగదును అందజేశారు. వలంటీర్లను చూడగానే పండుటాకుల్లో ఆత్మబంధువును చూసిన అనుభూతిని పొందారు. జిల్లాలో 2,69,188 పింఛన్లు ఉన్నాయి. అందుకుగాను రూ. 79,61,71,000 పంపిణీకి చర్యలు చేపట్టారు. ఇంటింటికి పింఛన్లను పంపిణీ చేయడం పట్ల లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం
కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థచే నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్, డిగ్రీ ఫస్ట్ ఇయర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ పెతకంశెట్టి సోమ సత్యశేఖర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 25వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 8555902362, 9701133148 నంబర్లో సంప్రదించాలని ఆయన తెలిపారు. అలాగే మైనార్టీ గురుకుల పాఠశాలలైన కడప(బాలుర), వేంపల్లె(బాలికల)లో అడ్మిషన్ల కోసం మైనార్టీ విద్యార్థులు మే 1వ తేదీ నుంచి దరఖాస్తులు ఆయా పాఠశాలల్లో స్వీకరించనున్నట్లు చెప్పారు. మైనారిటీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష లేకుండా నేరుగా 5,6,7,8 తరగతుల్లో ప్రవేశం కల్పిస్తామని తెలిపారు.


నూతన నియామకం



నియామక పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

జమ్మలమడుగు: వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెక్రటరీగా రాగిమాను చాంద్‌బాషాను నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి ప్రకటించారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో చాంద్‌బాషాకు నియామక పత్రం అందించారు. రాగిమాను చాంద్‌బాషా మాట్లా డుతూ రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకోవటానికి, జమ్మలమడుగు నియోజకవర్గంలో సుధీర్‌రెడ్డిని గెలిపించడం కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఆర్థిక లావాదేవీలపై అవగాహన తప్పనిసరి



విజేతలకు ప్రశంసాపత్రం అందిస్తున్న ఎ. ప్రభాకర్‌రెడ్డి, దుర్గాప్రసాద్


కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఆర్థిక, బ్యాంకు లావాదేవీలతోపాటు సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ దుర్గాప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం కడప చెమ్మమియాపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకింగ్ లావాదేవీలపై అవగాహన సదస్సును నిర్వహించారు. అనంతరం వీటిపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతి,ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మేరీ, సుజాతమ్మ పాల్గొన్నారు.

ఐబీ సిలబస్ అమలు సంతృప్తికరం
రాయచోటి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాఠశాలల్లో అమలు చేస్తున్న ఐబి సిలబస్ అమలు సంతృప్తికరంగా ఉందని విదేశీ అధ్యయన పరిశీలకులు అభిప్రాయపడ్డారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా పరిధిలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, గురుకుల పాఠశాలలో, గిరిజన సంక్షేమ పాఠశాలలో అమలవుతున్న విద్యా విధానాన్ని వారు పరిశీలించారు. సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రాయచోటిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన బాలికల ఉన్నత పాఠశాలను వారు పరిశీలించారు. తరువాత జిల్లా విద్యాశాఖఅధికారి కార్యాలయంలో జిల్లాలో అమలవుతున్న విద్యా విధానంపై జరి గిన సమీక్షా సమావేశంలో పాఠశాలల ప్రగతి అభ్యసన స్థాయి, పిల్లల బోధన సామర్థ్యం గురించి బృందం సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఐబీ సిలబస్ రూపకల్పనలో సీనియర్ మేనేజర్ వెండిగీన్ (అమెరికా), పర్సనల్ డెవలప్మెంట్ స్పెషల్ ఆఫీసర్ ఎరిక్ బాబర్ (ఇంగ్లాండ్), ఎస్‌సీఈఆర్‌టీ ప్రతినిధి గిరిబాబు పాల్గొన్నారు.

పేదలకు అనుగ్రహం



నా పేరు దుర్గా లక్ష్మీ. రాజుపాలెం మండలం గాదెగూడూరు గ్రామం. నాకు జగనన్న ప్రభుత్వంలో ఇళ్లు ఇళ్లు మంజూరైంది. వెంటనే ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించి త్వరగా పూర్తి చేసి ఇంట్లో కూడా చేరాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.



కడప పరిధిలోని మామిళ్లపల్లె లేఅవుట్‌లో గృహ నిర్మాణాలు

మేడంటే మేడ కాదు...గూడంటే గూడు కాదు...పదిలంగా అల్లుకున్న పొదరిల్లు మాది అని ఓ సినీ కవి అన్నారు. కోట్లాది రూపాయల ధనం, ఆస్తులున్నా ఇల్లాలి మనసుకు సొంతిల్లు ఉంటేనే మనశ్శాంతి ఉంటుంది. అది చిన్నదైనా, పెద్దదైనా ఒకటే. సొంత గూటి కోసం ఇల్లాలి తపన చెప్పలేనిది. అందుకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు నడుం బిగించారు.

- జిల్లాలో 97,194 గృహాల రిజిస్ట్రేషన్
- మొత్తం బడ్జెట్ రూ. 171.73 కోట్లు
- పేదల గూటికి అధిక ప్రాధాన్యతనిచ్చిన ప్రభుత్వం
- ఇప్పటివరకు జిల్లాలో 31,642 గృహాలు పూర్తి

కడప సిటీ: రాష్ట్ర ప్రభుత్వం పేదలను అనుగ్రహించింది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం ద్వారా అర్హులందరికీ ప్రభుత్వం సొంతింటి కల సాకారం చేస్తోంది. గత ప్రభుత్వం పేదల నిర్మాణాన్ని గాలికి వదిలేయగా, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక లక్షల సంఖ్యలో ఇళ్ల నిర్మాణం చేపట్టి పేద ఆడపడుచుల సొంతింటి కల సాకారం చేసేందుకు కృషి చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 452 లే–అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయి. సొంత స్థలం ఉన్నా కట్టుకునే స్థోమత లేకపోవడాన్ని గుర్తించి ప్రభుత్వమే ఇల్లు నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. బద్వేలులో 69, జమ్మలమడుగు 81, కడప 16, కమలాపురం 48, మైదుకూరు 62, ప్రొద్దుటూరు 36, పులివెందులలో 102 లే–అవుట్లలో ఇళ్ల నిర్మాణం కొనసాగుతోంది. మొత్తం 402 లే–అవుట్లలో 1,00,128 ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటు స్థలంలో ఇల్లు కట్టుకునేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలో మొత్తం 1,00,128 పక్కా గృహాలకుగాను 97,182 గృహాలు రిజిష్టర్ చేశారు. 635 గృహాలు వివిధ కారణాల వల్ల ప్రారంభం కాలేదు. 13,108 గృహాలు బేస్‌మెంట్‌కు లోబడి ఉన్నాయి. 31,884 గృహాలు బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నాయి. గోడల వరకు 10,680 గృహ నిర్మాణాలు ఉన్నాయి. శ్లాబ్ లెవెల్‌లో 9,233 ఇళ్లు ఉన్నాయి. ఇప్పటివరకు 31,642 పక్కా గృహాల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇందుకుగాను రూ. 1071.73 కోట్లు నిధులు ఖర్చు చేశారు.

పూర్తిగా రిజిస్ట్రేషన్లు: నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు కార్యక్రమం కింద లబ్ధిదారుల ఇంటికి ప్రభుత్వం సర్వహక్కులు కల్పిస్తోంది. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద రిజిస్ట్రేషన్ పద్ధతికి శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు మంజూరైన ఇళ్లు కూడా రిజిస్ట్రేషన్ చేయించిన పరిస్థితి నెలకొంది. రూరల్ ప్రాంతాల్లో అయితే రూ.10 వేలు, మున్సిపాలిటీలో రూ. 15 వేలు, నగర పాలక సంస్థలో రూ.20 వేలు రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించిన తర్వాత అందుబాటులో ఉన్న సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకునేలా సౌకర్యం కల్పించారు. ఈ విధానంతో లబ్ధిదారులు తమ ఇంటిపై పూర్తి హక్కుతోపాటు అవసరమైనపుడు తనఖా పెట్టుకుని రుణాన్ని పొందే అవకాశం ఉంటుంది.

చెల్లింపులు ఇలా
ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ప్రభుత్వం అందజేస్తోంది. బేస్‌మెంట్‌కు రూ.60 వేలు, గోడలకు రూ. 60 వేలు, శ్లాబుకు రూ.30 వేలు, పూర్తయిన తర్వాత రూ. 30 వేలు కలిపి మొత్తం రూ.1.80 లక్షలు లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేస్తోంది. అంతేకాకుండా స్వయం సహాయక సంఘాల మహిళలకు మెప్మా ద్వారా మరో రూ.35 వేల రుణం తీసుకునే సదుపాయం ఉంటుంది.

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు



జిల్లాలో శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. పనుల నిర్వహణపై ప్రతిరోజు సమీక్ష నిర్వహించి సూచనలు, సలహాలు ఇస్తున్నాం. నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల సాకారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. – విజయరామరాజు, కలెక్టర్, వైఎస్సార్ జిల్లా

క్షేత్ర పరిశీలన



జిల్లాలో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాం. అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి నిర్మాణ పనులు మరింత వేగవంతం అయ్యేలా కృషి చేస్తున్నాం. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు అందరూ చురుగ్గా పనిచేసేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. అనుకున్న సమయానికి ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం. – కృష్ణయ్య, పీడీ, గృహ నిర్మాణశాఖ, కడప

రేపు పల్స్‌పోలియో



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

కడప రూరల్: ఈనెల 3వ తేదీ నుంచి నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆ మేరకు శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలోని చాంబర్‌లో పల్స్‌పోలియో కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ ఈనెల 3వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 2,28,131 మంది ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలను వేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా 2029 పోలియో బూత్‌లు, 51 మొబైల్ టీములు, 23 ట్రాన్సిట్ పాయింట్స్ ద్వారా 8264 మంది వ్యాక్సినేటర్స్‌తోపాటు 203 రూట్ సూపర్‌వైజర్ ద్వారా పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతానికి చర్యలు చేపట్టామన్నారు. భారతదేశంలో పోలియో వ్యాధి లేనప్పటికీ పొరుగు దేశాలైనా పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ లాంటి దేశాల్లో పోలియో కేసులు నమోదవుతున్నాయని అన్నారు. అందువల్ల దేశ వ్యాప్తంగా పల్స్‌పోలియో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కాగా, జిల్లాలో 2006 తర్వాత పోలియో కేసులు నమోదు కాలేదన్నారు. వలసలు వచ్చిన వారు, భవన నిర్మాణాలు జరిగే ప్రదేశాలు, ఇటుకల బట్టీలు, అటవీ ప్రాంతాల్లో ఉండే వారిని గుర్తించి పోలియో చుక్కలు వేయడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జిల్లా టీకాల అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ మాట్లాడుతూ పెద్దలు తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కల మందును వేయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగామ్ అధికారులు డాక్టర్ శశిభూషణ్‌రెడ్డి, డాక్టర్ రవిబాబు, డాక్టర్ రమేష్, డాక్టర్ సునీత, మాస్ మీడియా అధికారి భారతి, ఉప మాస్‌మీడియా అధికారి రమణమ్మ, కమ్యూనిటీ ఆరోగ్య అధికారి మునిరెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అవకాశవాదానికే అందలం..!

- టీడీపీ జెండాను నమ్ముకుంటే నట్టేట మునగడమే..
- పులివెందులలో 27ఏళ్లు అన్నీతానై పార్టీ నడిపినా...
- అవమానం, ఛీదరింపులతో దూరమైన సతీష్‌రెడ్డి
- టీడీపీకి దూరం కానున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌రెడ్డి



సతీష్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, కడప: కార్యకర్తలకు పసుపు జెండా అండగా నిలిచేది.. ఇది ఒకప్పటి మాట. కాలక్రమేణ అధినేత చంద్రబాబు సహజసిద్ధమైన అవకాశవాదం ఆచరణలో చూపెట్టారు. దీంతో పల్లకి మోసే బోయిలుగా తెలుగుతమ్ముళ్లను చూస్తున్నారు. స్వాయితో నిమిత్తం లేకుండా నాయకులను కరివేపాకు చందంగా వాడుకుంటున్నారు. టీడీపీ జెండాను చిత్తశుద్ధితో నమ్ముకున్నా, కష్టకాలంలో పోరాటం చేసినా అవేవి ప్రామాణికంగా నిలవలేదు. అవసరాలకు అనువైన వారిని ప్రోత్సహిస్తూ సీనియారిటీని విస్మరిస్తున్నారు. టీడీపీని నమ్ముకుంటే నట్టేట మునగడమేనని రుజువు చేస్తున్నారు. పాతరోజుల్లో పులివెందులలో టీడీపీ జెండా పట్టడడం బహు అరుదుగా ఉండేది. అలాంటి చోట ఏకంగా 27 ఏళ్లు టీడీపీ ఉన్నతి కోసం ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి కష్టపడ్డారు. గెలిచే అవకాశం లేదని తెలిసి, ఐదు టర్మ్‌లు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే టీడీపీ కోసం శక్తిమేరకు వీరోచిత పోరాటం చేశారు. అలాంటి నాయకుడికి టీడీపీలో నిరాదరణ ఎదురైంది. మరోవైపు నారా లోకేష్ నేతృత్వంలో అవమానాలు చవి చూశారు. పులివెందుల టీడీపీ ఉన్నతికి పనిచేసిన సతీష్‌రెడ్డి ఆ పార్టీ నుంచి స్వచ్ఛందంగా నిష్క్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాంటి పరిస్థితే మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డికి పట్టింది. 25ఏళ్లుగా టీడీపీ కోసం పనిచేశారు. 1999 నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. రాయచోటి ఎమ్మెల్యే, రాజంపేట ఎంపీగా పోటీ చేసి, ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ నియోజకవర్గ ఇన్‌చార్జీగా టీడీపీ అభివృద్ధికి విశేష కృషి చేశారు . ఒకదశలో అధినేత చంద్రబాబు సైతం ప్రశంసించారు. తీరా అభ్యర్థులు ఖరారు నాటికి రమేష్‌రెడ్డిని పక్కన పెట్టేశారు. మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అభ్యర్థిత్వం ఖరారు చేశారు. ఎంతటి నాయకుడైనా సరే, వాడుకోవడం వదిలేయడంలో చంద్రబాబును మించిన నాయకుడు మరొకరు లేరని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

నమ్మి వస్తే ఉన్న ఉద్యోగం పోయా...
ఇరిగేషన్‌శాఖలో డీఈగా పనిచేస్తున్న రోశన్న టీడీపీ అభ్యర్థిత్వం కోసం ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఇప్పుడు ఆ సీటు జనసేన–బీజేపీ అంటూ దోబుచులాడుతోంది. అంతకు ముందు 2019లో డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్ ఉద్యోగాన్ని వదిలి టీడీపీ అభ్యర్థిగా తెరపైకి వచ్చారు. ఐదేళ్లకు ఆయన్ను పక్కకు నెట్టేసి, ఆస్థానంలో రోశన్నను తీసుకొచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబును నమ్మి ఉద్యోగానికి రాజీనామా చేస్తే ఇప్పటికీ అభ్యర్థిత్వం ఖరారు కాలేదు. అవుతుందో, లేదో చెప్పలేని పరిస్థితి నెలకొంది. డాక్టర్ రాజశేఖర్ పరిస్థితి భవిష్యత్‌లో రోశన్నకు రాదన్న గ్యారెంటీ లేదని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అలాగే కడపలో కష్టకాలంలో టీడీపీ జెండాను ఎత్తుకున్న సీనియర్ నేత ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, దుర్గాప్రసాద్, అమీర్‌బాబుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైంది. క్షేత్రస్థాయిలో పార్టీ ఉన్నతికి కృషి చేసినా అనూహ్యంగా ఆ స్థానంలోకి మాధవీరెడ్డిని తెరపైకి తెచ్చారు. అలాంటి పరిస్థితి తంబళ్లపల్లెలోనూ నెలకొంది. ఎవరూ లేరనుకున్నప్పుడు బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో స్థిరపడిన శంకర్‌యాదవ్‌ను తీసుకొచ్చారు. 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. 2019లో ఓడిపోయినా టీడీపీ ఉన్నతి కోసమే పనిచేశారు. నారా లోకేష్, చంద్రబాబు కార్యక్రమాలను సైతం శంకర్ యాదవ్ ద్వారా చేయించారు. అభ్యర్థిత్వం ఖరారు నాటికి పార్టీ కోసం ఏమాత్రం కష్టపడని సంబంధం లేని జయచంద్రారెడ్డి ప్రత్యక్షమయ్యారు. ఇవన్నీ పరిశీలిస్తే అవకాశవాదమే చంద్రబాబు విధానంగా స్పష్టమవుతోందని పరిశీలకులు భావిస్తున్నారు.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం





హాల్ టికెట్ నెంబర్లను చూసుకుంటున్న విద్యార్థులు, పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

17042 మంది విద్యార్థులకు 16398 మంది హాజరు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి ప్రథమ సంవత్సర పరీక్ష శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 69 పరీక్ష కేంద్రాల్లో మొదటిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ ఒకేషల్ సబ్జెకుల పరీక్షలకు 17042 మంది హాజరుకావాల్సి ఉండగా 16,398 మంది హాజరయ్యారు. 96.22 శాతంగా విద్యార్థుల హాజరుశాతం నమోదైంది.

పరీక్ష కేంద్రాల తనిఖీ
కడపలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలను ఇంటర్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య తనిఖీ చేశారు. అలాగే ఇంటర్ పరీక్షల జిల్లా అబ్జర్వర్ డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి జేఎంఏ జూనియర్ కళాశాల, నారాయణ జూనియర్ కళాశాల, చైతన్య చిల్డ్రన్స్ అకాడమి, విజ్ఞాన జూనియర్ కళాశాలలను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. జిల్లాలో ఎక్కడా ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులుకానీ, డీబార్ కేసులు కానీ నమోదు కాలేదు.

కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు...
ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఎవరైనా కాపీయింగ్‌కు పాల్పడితే చర్యలు తీసుకుంటామని ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య, పరీక్షల జిల్లా స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులంతా నిర్ణీత సమయానికే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.


నేడు ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం
ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శనివారం ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభంకానున్నాయి. జిల్లావ్యాప్తంగా 18098 మంది హాజరుకానున్నారు. ఇందుకోసం అధికారులు ఏర్పాట్లు పూరిచేశారు.

ఇది బృహత్తర పథకం



మా ఊరు పులివెందుల.కడపలోని మరియాపురం ఎస్సీ హాస్టల్ లో ఉంటూ చదువుకుంటున్నాను. విద్యా రంగానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో.. 'జగనన్న విద్యా దీవెన'అనే బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్య ప్రదాతగా చరిత్రలోనే సుస్థిర స్థానాన్ని సంపాదించారు.
– బి.హేమలత, నర్సింగ్ విద్యార్థి, కడప

ఏ సీఎం ఇలాంటి పథకం తీసుకురాలేదు



మాది అనంతపురం. కడపలోని సంక్షేమ హాస్టల్లో ఉంటున్నాను. వరుసగా నాలుగో ఏడాది కూడా లబ్ధి పొందుతున్నాను. మాలాంటి వారు ఉన్నత చదువులు చదువుకోవడానికి ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారు. 'జగనన్న విద్యాదీవెన'ద్వారా ఆర్థిక సాయం అందడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకుంటున్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలాంటి గొప్పపని చేయలేదు. –ఎం. ఛార్మి, నర్సింగ్ విద్యార్థి, కడప

చదువుతోనే ఉజ్వల భవిత

- కలెక్టర్ విజయరామరాజు
- 44,876 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 34.52 కోట్ల
- విద్యాదీవెన నిధులు జమ



విద్యార్థులు, తల్లులకు మెగా చెక్కును అందజేస్తున్న కలెక్టర్, ఇతర అతిథులు

కడప సెవెన్‌రోడ్స్: చదువుతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని కలెక్టర్ విజయరామరాజు తెలిపారు. పిల్లల చదువులు తల్లిదండ్రులకు ఏ మాత్రం ఆర్థిక భారం కారదని రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా దీవెన కార్యక్రమాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. 2023– 24 విద్యా సంవత్సరానికి సంబంధించి 'జగనన్న విద్యా దీవెన'పూర్తి రీ యింబర్స్‌మెంట్ లబ్ధి మొత్తాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం విద్యార్థుల తల్లుల ఖాతాలో జమచేశారు. వీసీ అనంతరం ఇందుకు సంబంధించిన మెగా చెక్కును కలెక్టర్ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గతంలో ఎన్నడూలేని విధంగా తొలిసారిగా పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంటు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నిరుపేద విద్యార్థులు ఉన్నత చదువులకు వెళ్లే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు.

అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి విద్యా సంబంధిత సంక్షేమ పథకాల ఫలాలు అందాలన్నదే ముఖ్యమంత్రి లక్ష్యమని, 'జగనన్న విద్యా దీవెన'లబ్ధి పొందడంలో ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు ఎదురైతే.. సంబంధిత సంక్షేమ శాఖల జిల్లా అధికారికి తెలియజేయవచ్చని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర పీఆర్ శాఖ సలహాదారు నాగార్జున రెడ్డి, రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు పి.శివ ప్రసాద్‌రెడ్డితో పాటు వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు మంజూరైన లబ్ధి వివరాలు

- జిల్లాలో మొత్తం 44,876 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ. 34,52,64,997 లు మంజూరైంది.
- ఎస్సీ సంక్షేమం కింద 8,193 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.5.33. కోట్లు జమ
- ఎస్టీ సంక్షేమం కింద 677 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.46.35 లక్షలు మంజూరు
- బీసీ సంక్షేమం కింద 16,587 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.12.36 కోట్లు విడుదల
- ఈబీసీ కింద 7,587 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.7.70 కోట్లు మంజూరు
- కాపు సంక్షేమం కింద 6,141 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.5.00 కోట్లు విడుదల
- ముస్లిం మైనారిటీ కింద 5,591 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.3.58 కోట్లు ఖాతాలకు జమ
- క్రిస్టియన్ మైనారిటీ కింద 100 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.7.06 లక్షలు విడుదల

చదువుపై మక్కువ పెరుగుతోంది



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో సమూలమైన మార్పులు తెచ్చారు. విద్యార్థుల్లో చదువుపై మరింత ఇష్టాన్ని పెంచుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల తల్లులకు అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి ఆర్థిక లావాదేవీల విషయంలో సీఎం వైఎస్ జగన్ నైపుణ్యాన్ని పెంచుతున్నారు. – కె.మీనాక్షి, డిగ్రీ విద్యార్థి, కడప

తల్లులకు ప్రాధాన్యత



వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా భాద్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో అనూహ్యమైన మార్పులు సంతరించుకున్నాయి. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వమే కల్పిస్తోంది. ముఖ్యమంత్రికి చాలా థ్యాంక్స్. మేం జిల్లా, రాష్ట్రంలోనే కాకుండా దేశ విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకునేలా ప్రోత్సహిస్తున్నారు.
– వైసీ హరిప్రియ, నర్సింగ్ విద్యార్థి, కడప

పాండిచ్చేరి మద్యం పట్టివేత


మద్యం సీసాలు, నిందితులతో సెబ్ అధికారులు

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక వాసవీ సర్కిల్‌లో సమీపంలో ఇద్దరి నుంచి పాండిచ్చేరి రాష్ట్రానికి చెందిన 40 మద్యం సీసాలను సెబ్ అధికారులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు.. ప్రొద్దుటూరు సెబ్ ఇన్‌స్పెక్టర్ మహేష్ కుమార్, సిబ్బందితో కలిసి శుక్రవారం దాడులు నిర్వహించారు. మహేంద్రనగర్‌కు చెందిన మార్తల గురునాథరెడ్డి, మార్తల గురు రమేష్‌రెడ్డి మోటార్ బైక్‌లో పాండిచ్చేరికి చెందిన మద్యం తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని సెబ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపనున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనలో ముగ్గురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బి కొత్తకోట మండలం బడికాయలపల్లె పంచాయతీ చెరువు ముందర పల్లెకు చెందిన భాస్కర్ దంపతులు కుటుంబ సమస్యలతో గొడవపడ్డారు. తల్లిదండ్రులు గొడవ పడుతున్నారనే కారణంతో మనస్తాపం చెంది భాస్కర్ కుమార్తె (17) పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మరో ఘటనలో ములకలచెరువు మండలం వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లెకు చెందిన శివకుమార్ భార్య పి.దీప (25) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అదే విధంగా సోంపల్లి కు చెందిన హరూన్‌భాషా భార్య ఎస్.నూర్జహాన్ (40) అనారోగ్యం భరించలేక గాజు పెంకులు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

నాటి రామబాణం..నేటి రామతీర్థం

- నాగేటి తిప్పపై పార్వేటి మండపం ఆధునికీకరణ
- రామతీర్థం ప్రాశస్త్యాన్ని గుర్తించిన టీటీడీ
- ముమ్మరంగా తీర్థం అభివృద్ధి పనులు..

ప్రాంతం	రూ.వ్యయం
రామతీర్థం	రూ.35లక్షలు
పారువేట కొండ	రూ.60లక్షలు


టీటీడీ నిర్మించిన పారువేటకొండ నిర్మాణం


టీటీడీ చేపట్టిన రామతీర్థం జీర్ణోద్ధరణ పనులు

రాజంపేట : పశువులు, పక్షుల దాహం తీర్చేందుకు సీతమ్మ కోరిక మేరకు.. రాముడు వదలిన బాణంతో నీరు పైకి ఉబికింది. నీరు పైకి వచ్చింది. ఆ నీటి బుగ్గలే నేడు రామతీర్థం.. లక్ష్మణ తీర్థంగా పిలుస్తున్నారు. ఏప్రిల్ మాసంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు చేపడుతున్న నేపథ్యంలో టీటీడీ ఇక్కడ అభివృద్ధి పనులను వేగవంతం చేసింది. ఇప్పటికే ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో టీటీడీ చైర్మన్లు వైవీ.సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి రామతీర్థం వైభవం చాటిచెప్పేలా రూ. 35 లక్షలతో చేపట్టిన నిర్మాణాలు పూర్తి కావస్తున్నాయి.

ఆలయ ప్రాశస్త్యం

త్రేతాయుగంలో దండకారణ్యంలో సీత,రామ,లక్ష్మణులు నివసిస్తున్నపుడు పశువులు, పక్షులు దప్పిక తీర్చుకోవడం ఎలా అంటూ సీత, రాముడుని అడిగిందని, సీతమ్మ కోరిక మేరకు.. రామ, లక్ష్మణులు బాణం సంధించి భూమిలోకి వదిలాడు. నీరుపైకి ఎగజిమ్మింది.. ఆ ప్రదేశంలో ఏర్పడిన వాటినే నేడు రామ, లక్ష్మణ తీర్థాలుగా పిలుస్తున్నారని భక్తుల నమ్మకం. పూర్వం ఈ తీర్థంలో స్నానం చేసిన తర్వాత స్వామిని దర్శించుకునే వారు. కొన్ని దశాబ్దాల కిందట సారంగపాణి అనే ప్రధాన అర్చకుడు ఈ నీటితో ఏకశిల మూర్తులకు అభిషేకం నిర్వహించారని, ఈ నీటిని తాగితే రోగనివారణ అవుతుందని పూర్వీకులు చెబుతారు. ఈ ప్రాంతాన్ని కంపరాయలు సందర్శించిన క్రమంలో ఈ బుగ్గనలో నీటిని తాగే ఆలయానికి, అటు చెరువుకు మధ్య ఆలయ నిర్మాణానికి అంకుర్పారణ చేసింది. బ్రహ్మోత్సవాల సమయంలో చక్రస్నానం, అంకుర్పారణ రామతీర్థంలోనే నిర్వహిస్తున్నారు. దీంతో ఇప్పుడు రామతీర్థం చుట్టూ టీటీడీ కంచె వేసింది.

పారువేట కొండకు మహర్దశ

రామాలయానికి పడమట వాయవ్యంగా మరొక చిన్న కొండ(నాగేటితిప్ప) కనిపిస్తుంది. ఈ కొండమీద స్వామికి పారువేట ఉత్సవం నిర్వహిస్తారు. సంక్రాంతి తర్వాత కనుమ రోజున సాయంకాలం స్వామి విల్లంబులు ధరించి ఇక్కడికి చేరుకున్న అనంతరం పారువేటలో భాగంగా ఒక కుందేలును విడుస్తారు . అది పెరుగెత్తుకొండూ వెళ్తుంటే ప్రజలు ఆ కుందేలు కోసం వెంటబడతారు. ఈ ఉత్సవం కోసం కొండమీద మండపం ఉంది. ప్రస్తుతం ఇక్కడ శిథిలమైన పార్వేట మండపాన్ని టీటీడీ రూ.60 లక్షలతో తీర్చిదిద్దుతున్నారు. అంతేగాక కొండపైకి వెళ్లడానికి మెట్లమార్గం నిర్మాణాలు చేపట్టారు.

ఒంటిమిట్టకు మహా వైభవం



ఒంటిమిట్ట రామాలయానికి మహా వైభవం సంతరించుకుంది. టీటీడీ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట పుణ్యక్షేత్రం భాసిల్లుతోంది. చరిత్రాత్మకమైన రామతీర్థం పరిరక్షణతోపాటు అభివృద్ధి చేయడం అవసరం. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో టీటీడీ చైర్మన్లు వైవీ.సుబ్బారెడ్డి నుంచి నేటి భూమన కరుణాకర్‌రెడ్డిల హయాంలో ఒంటిమిట్ట రామాలయాన్ని నూతన శోభ సంతరించుకుంటోంది.

– మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

రామతీర్థం ప్రాశస్త్యం తెలియజేయాలి



త్రేతాయుగంలో ఏకశిలానగరం (ఒంటిమిట్ట)లో రాముడు, లక్ష్మణుడు వేసిన బాణంతో పాతాళగంగను పైకి తీసుకొచ్చి సీతమ్మ దప్పిక తీర్చిన నీటిబుగ్గ ప్రాంతమే రామతీర్థం. ఆ ప్రాశస్త్యం నేటి తరానికి తెలియజేయాలి. టీటీడీ రామతీర్థం అభివృద్ధి చేసేందుకు నడుంబిగించడం ప్రశంసనీయం. పూర్వం ఈ నీటితో స్వామికి అభిషేకం చేసేవారు. ఈ నీటితో రోగనివారణ జరిగేదని భక్తులు నమ్మేవారు.

– పసుపులేటి శంకర్, పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు, ఒంటిమిట్ట

'భారతి' సిమెంట్‌తోనే అత్యుత్తమ నిర్మాణాలు


తాపీ మేస్త్రీలకు ఉచిత ప్రమాద బీమా బాండును అందజేస్తున్న భారతి సిమెంటు టెక్నికల్ ఇంజినీరు కె.నాగేంద్ర

కడప కల్చరల్ : అత్యుత్తమ నిర్మాణాలు చేయడం భారతి సిమెంట్‌తోనే సాధ్యమని ఆ సంస్థ టెక్నికల్ ఇంజనీరు కె.నాగేంద్ర అన్నారు. శరణ్య ట్రేడర్స్ ఆధ్వర్యంలో కడప నగర పరిధిలోని పులివెందుల రింగ్ రోడ్డులో తాపీ మేస్త్రీలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంజనీరు నాగేంద్ర మాట్లాడుతూ భారతి సిమెంట్ అల్ట్రా ఫాస్ట్ పద్ధతిలో ఉంటుందని, రొబొటిక్ టెక్నాలజీతో తయారవుతుందని తెలిపారు. భవన నిర్మాణాలలో ప్రధాన పాత్ర పోషించే పైకప్పు (శ్లాబ్)కు ఈ సిమెంటు అనుకూలమైందన్నారు. ఈ సందర్భంగా తాపీ మేస్త్రీలకు రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సేల్స్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, డీలర్ మహేశ్వర్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

సినీ ఫక్కీలో ఏటీఎం కార్డు చోరీ


చోరీ జరిగిన ఏటీఎం ఇదే

రాజంపేట : రాజంపేట ఎస్‌బీఐ ఏటీఎం వద్ద సినీ ఫక్కీలో చోరీ జరిగిన సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నందలూరు మండలం కుంపిణీపురానికి చెందిన ఎస్.రాజేశ్వరి తన ఏటీఎం కార్డుతో నగదు విత్‌డ్రా చేసుకునేందుకు ఏటీఎం వద్దకు వచ్చింది. ఆమెకు డ్రా చేసుకోవడం చేతకాకపోవడంతో ఓ వ్యక్తిని ఆశ్రయించింది. ఆ వ్యక్తి మహిళకు నగదు విత్‌డ్రా చేయిస్తానని చెప్పి, పిన్ నెంబరు తెలుసుకున్నారు. కార్డును చోరీ చేసి పిన్ నెంబర్ తప్పు అని చెప్పి మరో కార్డు చేతిలో పెట్టి వెళ్లిపోయారు. బాధిత మహిళ ఏటీఎం కార్డుతో పలు దపాలుగా రూ.50 వేలు చోరీ చేశారు. జరిగిన మోసం తెలుసుకొని బాధిత మహిళ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జాతీయ అవార్డుకు ఎంపిక



కడప ఎడ్యుకేషన్ : జాతీయ స్థాయిలో ఉర్దూ భాష, సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి అందించే అమీరున్నీషా ఎడ్యుకేషన్ అండ్ వేల్ఫేర్ ఫౌండేషన్ సంస్థ జాతీయ అవార్డుకు కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం మూలవంక జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సత్తార్ ఫైజీ ఎంపిక య్యారు. సత్తార్ ఫైజీ ఉపాధ్యాయుడితోపాటు ప్రముఖ కవి, రచయిత కూడా. ఈయన రచించిన గజల్ పుస్తకం నషీద్‌కు ఎంపికైనట్లు సత్తార్‌ఫైజీ తెలిపారు. గత 40 సంవత్సరాల నుంచి ఉర్దూ విద్య సాహితి, సాంస్కృతిక, నాటకరంగ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఈయన ఇప్పటికే జీవిత సాఫల్య అవార్డుతోపాటు, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. ఇపుడు మరో అవార్డుకు ఎంపికవడంతో హెడ్‌మాస్టర్ ఇర్షాద్ అహ్మద్, జిల్లా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాష్‌బాషా, సంగీత సాగర్ అకాడమీ ప్రధానకార్యదర్శి సయ్యద్ నయిం, సింగర్ మహబూబ్‌బాషా, రాయలసీమ ఉర్దూ రచయితల సమాఖ్య అధ్యక్షుడు డాక్టర్ ఇక్బాల్ ఖుస్రూఖాద్రి, ఉర్దూ అధ్యాపకులు డాక్టర్ ఖాజాపీర్, బజ్మె జావిద్ ఉపాధ్యక్షుడు డాక్టర్ అంజాద్‌అలీ అభినందించారు.

సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలి

– ఎస్పీ సిద్దార్థ్ కౌశల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

జమ్మలమడుగు : రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా కొనసాగించేందుకు అధికారులు సిద్ధం కావాలని ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ పేర్కొన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయ సభా భవనంలో పోలీసు అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షించారు. ఎస్పీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని మొత్తం పోలింగ్ కేంద్రాలలో సమస్యాత్మక గ్రామాలు , పోలింగ్ కేంద్రాలను గుర్తించడంతో పాటు సమస్యలు సృష్టించే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గత ఎన్నికల్లో నేరాలకు పాల్పడిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. మద్యం , నగదుతో ఓటర్లను ప్రలోభపెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రౌడీ షీటర్ల కదలికలపై నిఘా పెట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ యశ్వంత్, శిక్షణ డీఎస్పీ శ్రీకాంత్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాజు, పట్టణ సీఐ కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

పెండ్లిమర్రి : మండలంలోని వెల్లటూరులో రెడ్డి బాషా ప్రథమ చికిత్స కేంద్రాన్ని శుక్రవారం పెండ్లిమర్రి పీహెచ్‌సీ వైద్యుడు జె.వి.ఆర్.ప్రసాద్ సీజ్ చేశారు. డీఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. కేంద్రంలో మందులు, సైలెన్ బాటిళ్ల ఉండడంతో సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

కలెక్టర్ విజయరామరాజు


మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అన్నీ సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ వి.విజయరామరాజు అన్నారు. అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు ద్వారా సాధారణ ఎన్నికల సన్నద్ధత, తదితర అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్) ముఖేష్ కుమార్ మీనా సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి కలెక్టర్ వి.విజయరామరాజుతోపాటు జేసీ గణేష్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కలెక్టర్ వి.విజయరామరాజు మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ విధి విధానాల మేరకు జిల్లాలో అన్ని కార్యక్రమాలు ప్రణాళికా బద్ధంగా పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో ఓటరు చేర్పులు, మార్పులకు, తొలగింపులకు సంబంధించిన దరఖాస్తులన్నింటినీ దపరిష్కరించామన్నారు. నియోజకవర్గాల వారీగా ఎపిక్ కార్డులను రూపొందించామన్నారు. ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ పూర్తి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్సార్‌సీపీలోకి ఇతర పార్టీల నుంచి వలసలు మొదలయ్యాయి. మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో గల చెన్నంపల్లె గ్రామంలో టీడీపీకి చెందిన టి.వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో మంజుల వెంకటసుబ్బయ్య, వేముల సుబ్బరాజు, వేముల మధు, వల్లెపు శ్రీనివాసులుతోపాటు 50 కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారిని ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చెన్నంపల్లెలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు ఆకర్షితులవుతున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేస్తేనే పేదలకు మరింత మేలు జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, జగనన్న సామాజిక సాధికారత పేరుతో ఆయా వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా మేలు చేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన వారంతా సైనికుల్లా పనిచేసి మరోసారి బద్వేల్‌లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగుర వేసేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నిమ్మకాయల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ దస్తగిరి, వార్డు కౌన్సిలర్ రమాదేవి, వార్డు ఇన్‌చార్జి చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత వ్యాఖ్యలపై వలంటీర్ల నిరసన


ధర్నా చేస్తున్న వలంటీర్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి జీవీ.ప్రవీణ్ కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మున్సిపాలిటీ పరిధిలోని వలంటీర్లు నిరసన తెలిపారు. శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేసిన వలంటీర్లు ప్రవీణ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పలువురు వలంటీర్లు మాట్లాడుతూ ఆరో వార్డులో జరిగిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో తమను బట్టలు ఊడదీసి కొడతామని టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్ మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. కరోనాలో ప్రవీణ్ ఇంటి నుంచి బయటికి రాలేదని, వలంటీర్లమైన తాము ఊరంతా తిరిగి ప్రజలకు సేవలు అందించామన్నారు. జన్మభూమి కమిటీల మాదిరి తాము పర్సెంటేజీలు తీసుకోలేదని, వెంటనే టీడీపీ ఇన్‌చార్జి వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం ప్రవీణ్ కుమార్‌రెడ్డి చిత్రపటాన్ని వలంటీర్లు చెప్పుతో కొడుతూ నిరసన తెలిపారు. మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి వినతి పత్రం సమర్పించారు.

సభ నిర్వహణ హనుమంతరావు సొంతం


హనుమంతరావును సన్మానిస్తున్న నాగఫణిశర్మ

గోపవరం : వేలాది సాహిత్య సభలు, అవధానాలను రసజ్ఞ మనోజ్ఞంగా నిర్వహించడంలో వైఎస్సార్ జిల్లా బద్వేల్‌కు చెందిన విద్వాన్ డాక్టర్ గానుగపెంట హనుమంతరావు అందె వేసిన చేయి అని అవధాన సరస్వతి పీఠాధ్యక్షుడు బ్రహ్మశ్రీ డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లె కళా క్షేత్రంలో జరిగిన మహాశతావధానంలో చివరి రోజున హనుమంతరావును సత్కరిస్తూ ఆయన పైవిధంగా పేర్కొన్నారు. నాగఫణి శర్మ మాట్లాడుతూ హనుమంతరావు తెలుగు రామాయణ రచయిత్రి మొల్లమాంబ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేశారని ప్రశంసించారు. 77 సంవత్సరాల వయోభారాన్ని లెక్కచేయక హనుమంతరావు సమాజంలో సాహిత్య, సాంస్కృతిక వికాసం వెల్లివిరిసేలా నిర్విరామకృషి చేయడం యువతకు ఎంతో ఆదర్శప్రాయమన్నారు. నిత్యం తారకమంత్రంగా మొల్లమాంబను స్వీకరించి ఆమె పేరుతో సాహిత్య పీఠాన్ని స్థాపించి ఆమె విగ్రహాలను గోపవరంలో పాటు జిల్లా కేంద్రమైన కడపలో ప్రతిష్ఠించిన ప్రశంసా పాత్రులు అన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్, విజయవాడ నగర ఎమ్మెల్యే మల్లాదివిష్ణు, దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కర్నాటిరాంబాబు పాల్గొన్నారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్తోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

అమ్మఒడి వరం లాంటిది



మేము బద్వేల్‌పట్టణంలోని రజక వీధిలో నివసిస్తున్నాం. నా భర్త సురేష్ పెయింటింగ్ పనిచేసి కుటుంబాన్ని పోషిస్తున్నారు. నా కుమారుడు సుకాంత్ జెడ్పీ హైస్కూల్‌లో ఏడో తరగతి చదువు తున్నాడు. గతంలో బాబు చదువుకు సంబంధించిన పుస్తకాలు, ఇతర వస్తువులకు వేలల్లో డబ్బు ఖర్చయ్యేది. ఈ పరిస్థితుల్లో సీఎం జగనన్న వచ్చాక ఏటా అమ్మఒడి కింద ఇచ్చే రూ.15 వేల సాయం మాకెంతో ఆసరాగా నిలుస్తోంది. గతంలో కంటే బడి రూపురేఖలు మారాయి. కార్పొరేట్ స్కూళ్ల తరహాలో బడిని మార్చేశారు. జగనన్న అందిస్తున్న సాయం మరువలేనిది.

– చెప్పలి సునీత, రజకవీధి, బద్వేల్

జగనన్న ప్రభుత్వంలోనే ఇంటి నిర్మాణం



జగనన్న ప్రభుత్వంలోనే ఇల్లు మంజూరైంది. ఇంకో వారం, పది రోజుల్లో ఇంట్లో చేరేందుకు పనులను పూర్తి చేసుకుంటా. గతంలో నాకు మట్టి మిద్దె ఉండేది. గత ప్రభుత్వాల హయాంలో ఇల్లు మంజూరు చేయాలని ఎన్నోసార్లు కార్యాలయాల చుట్టూ అర్జీలు ఇచ్చాను. అయితే మంజూరు చేయలేదు. జగనన్న ప్రభుత్వంలో ఇల్లు కావాలని అడిగితే వెంటనే మంజూరు చేశారు. దీంతో పనులను తొందరగా చేసుకుంటున్నాను. జగనన్నకు కృతజ్ఞతలు.

– రామనాథుల మరియమ్మ, గోపాయపల్లె గ్రామం, రాజుపాలెం మండలం

ప్రాణం తీసిన ఇనుప కడ్డీ


ఇనుప కడ్డీ తగిలిన హరీష్


హరీష్(ఫైల్)

గుర్రంకొండ : జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన రోడ్ స్టాపర్‌కున్న ఇనుప కడ్డీ తగిలి ఒకరు మృతి చెందిన సంఘటన గుర్రంకొండలో శుక్రవారం జరిగింది. స్థానికులు.. పోలీసుల కథనం మేరకు.. ఎన్‌హెచ్ 340 రోడ్డుపై వేగంగా వెళ్లే వాహనాలను అదుపు చేయడానికి స్థానిక మార్కెట్ యార్డు సర్కిల్ వద్ద స్టాపర్లను ఏర్పాటు చేశారు. గుర్రంకొండ పంచాయతీ తలారివాండ్లపల్లెకు చెందిన కొమ్మిరి హరీష్(24) కారు నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మార్కెట్ యార్డు సర్కిల్ వద్ద నున్న ఓ హోటల్ ముందు నిలబడి ఉన్నాడు. ఇక్కడే రోడ్డు స్టాపర్లు ఉన్నాయి. మదనపల్లె నుంచి రాయచోటి వెళుతున్న కారు వేగంగా వచ్చి వాటిని ఢీకొనడంతో రాడ్లు ఎగిర హోటల్ వద్ద ఉన్న హరీష్‌ను బలంగా తాకాయి. 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ హరీష్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగార్జున రెడ్డి తెలిపారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

ములకలచెరువు : తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగిన సంఘటన స్థానిక మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ తిప్పేస్వామి కథనం మేరకు... స్థానిక కదిరి రోడ్డుకు చెందిన బాలిరెడ్డి గురువారం రాత్రి వ్యవసాయ పొలం వద్దకు పడుకోవడానికి వెళ్లాడు. ఆయన భార్య లక్ష్మీదేవి పుట్టింటి కోసం సత్య సాయి జిల్లా గాండ్లపెంటకు వెళ్ళింది. ఇంటికి తాళం వేసి ఉండడాన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు తాళం పగలగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. అనంతరం బీరువాలో ఉన్న రూ.1.30 లక్షల బంగారు నగలు చోరీ చేసుకుని వెళ్లారు. పొలం వద్ద నుంచి ఉదయం ఇంటికి వచ్చిన బాలిరెడ్డి ఇంటి తాళం పగలగొట్టి ఉండడాన్ని గమనించాడు. ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువా తాళం సైతం పగలగొట్టి ఉండడాన్ని చూశాడు. బీరువాలో బంగారు నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్‌ఐ తిప్పేస్వామి సంఘటన సహాయం చేరుకుని స్థానికులు విచారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.